సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 1 । మార్చి । 2024



ఆపరేషన్ ఆకర్ష్
ఆర్మూర్ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌ను చేపట్టింది.
- 8లో ▸



పరీక్షల్లో వసూళ్లు
టీసీసీ పరీక్షల్లో అధికారులు భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.2 /22.3

వాతావరణం
ఉదయం చలిగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలితీవ్రత కొనసాగుతుంది.



విజయ సంకల్ప యాత్ర ముగింపు సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, వేదికపై ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి

పసుపునకు విదేశాల్లో డిమాండ్

- బోర్డు ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం
- కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు హైవేల నిర్మాణం
- కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు
- 50 ఏళ్లలో ఆ పార్టీ దేశానికి చేసిందేమీలేదు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ


సభలో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు, ప్రజలు

సుభాష్‌నగర్/నిజామాబాద్‌రూరల్: విదేశాల్లో సేంద్రియ పసుపునకు డిమాండ్ ఉందని.. జిల్లాలో పండించే పసుపు స్వచ్ఛమైందని.. ఇతర దేశాలకు ఎగుమతి చేయవచ్చని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రకటన మేరకు పసుపుబోర్డు ఏర్పాటుకు కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. కొమురంభీం క్లస్టర్ విజయ సంకల్పయాత్ర ముగింపు సభను గురువారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నితిన్ గడ్కరీ ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లలో దేశానికి చేసిందేమీ లేదని, ముఖ్యంగా రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసిందని గడ్కరీ విమర్శించారు. ఆ పార్టీ పాలనలో దేశంలోని షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయని.. కానీ బీజేపీ హయాంలో ఇప్పటివరకు 66 ఫ్యాక్టరీలను తిరిగి తెరిపించామని, మిగతా వాటిని తెరిపించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో సుమారు 30వేల గ్రామాల్లో ప్రజలకు ఉపాధి, సరైన సౌకర్యాలు, సాగునీరు, విద్యుత్ లేక పట్టణాలకు వలసలు వెళ్లారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీలను ప్రైవేటీకరించి భ్రష్టుపట్టించారని ఆరోపించారు. తెలంగాణలో 7వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

రహదారుల అనుసంధానం

బీజేపీ పాలనలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జాతీయ రహదారులను నిర్మించామని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం రోడ్ల అనుసంధానంతో గ్రామాల్లోనే నిరుపేదలకు ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలి, లద్దాఖ్, కార్గిల్, శ్రీనగర్, జమ్మూ కశ్మీర్, అమృతసర్, ఢిల్లీ నుంచి ముంబయి, నాసిక్, అహ్మదాబాద్, సోలాపూర్, బెంగళూరు జాతీయ రహదారులపై టన్నెల్స్‌ను నిర్మించామన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని అన్ని హైవేలను అమెరికాలోని రహదారులుగా మారుస్తామని ప్రజలకు హామీనిచ్చారు.

సభకు హాజరైన కేంద్ర మంత్రి గడ్కరీని ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, వివిధ మోర్చాల ప్రతినిధులు సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జాతీయ నాయకులు ప్రదీప్‌కుమార్, ప్రభారీలు వెంకటరమణి, గద్దె భూమన్న, నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు పెద్దోళ్ల గంగారెడ్డి, మారంపల్లి సత్యనారాయణ, పాట్కూరి తిరుపతిరెడ్డి, న్యాలం రాజు, రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ ప్రసాద్, స్రవంతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, నాగోళ్ల లక్ష్మీనారాయణ, అమ్దాపూర్ రాజేష్, కిషన్ నాయక్ పాల్గొన్నారు.

రైతుల ఆదాయం పెంచేందుకు కృషి

బీజేపీ పదేళ్ల పాలనలో రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అనేక పథకాలు అమలు చేస్తున్నామని కేంద్రమంత్రి వివరించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించినప్పుడే ధనవంతులుగా మారుతారన్నారు. దేశంలోని రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇథనాల్ ఉత్పత్తికి ప్రోత్సాహకాన్ని మోదీ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. చెరుకు రసంతో మొలాసిస్ తయారవుతుందని, మొలాసిస్‌తో ఇథనాల్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఇథనాల్ నుంచి విమాన ఇంధనం కూడా తయారవుతుందని తెలిపారు. ఇథనాల్ ఉత్పత్తిలో రైతులు భాగస్వాములు అవుతున్నారని, నెలకు రూ. 5లక్షల వరకు లాభాలను ఆర్జిస్తున్నారని పేర్కొన్నారు.

దేశానికి పట్టిన అరిష్టం కాంగ్రెస్



దేశానికి పట్టిన అరిష్టం కాంగ్రెస్ అని, ఆ పార్టీని దేశం నుంచి తరిమికొట్టాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి పిలుపునిచ్చారు. నీతికి, అవినీతికి యుద్ధం జరగబోతుందని, రాహుల్ యాత్ర అన్యాయ యాత్ర అని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ జాతికి ద్రోహం చేసిందని, దేశాన్ని కాపాడాలంటే మోదీ అవసరమని పేర్కొన్నారు. ఎంపీ అర్వింద్ ధర్మపురి కాబోయే కేంద్ర మంత్రి అని అన్నారు. దేశానికి, హిందువులకు కాంగ్రెస్ ఎంతో అన్యాయం చేసిందన్నారు. నిజామాబాద్ నగరం ప్రమాదంలో ఉందని, రాబోయే రోజుల్లో బోధన్ రోడ్డుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

షుగర్ ఫ్యాక్టరీలపై కాంగ్రెస్ కాలయాపన



రాష్ట్రంలో షుగర్ ఫ్యాక్టరీల పునఃప్రారంభంపై కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేస్తోందని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. కానీ బీజేపీ అధికారంలోకి వస్తే షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని పేర్కొన్నారు. పసుపు రైతుల 38 ఏళ్ల కల అయిన పసుపు బోర్డును ప్రధాని మోదీ ప్రకటించారన్నారు. కేబినెట్ ఆమోదం, గెజిట్ నోటిఫికేషన్ కూడా వచ్చిందని తెలిపారు. పసుపు బోర్డు కార్యకలాపాలు అతి త్వరలోనే ప్రారంభమవుతాయని ప్రకటించారు. పసుపు ధర రూ. 14వేలు దాటిందని, ఎగుమతులు పెంచితే ధర రూ. 20వేలు దాటుతుందని ధీమా వ్యక్తంచేశారు.

బీఆర్ఎస్ చెల్లని రూపాయి



బీఆర్ఎస్ చెల్లని రూపాయి అని, ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు వచ్చే పరిస్థితి లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఎద్దేవా చేశారు. మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన కొనసాగుతోందన్నారు. ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలన్నారు.

న్యూస్‌రీల్

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు



సాక్షిప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలో జననీ సురక్ష యోజన(జేఎస్‌వై), జనని శిశు సురక్ష కార్యక్రమం(జేఎస్ఎస్‌కే) నిధుల దుర్వినియోగంపై విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినియోగదారుల మండలి జాతీయ కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిపాలనాధికారి గంగాధర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదేళ్ల నుంచి జిల్లాకు జేఎస్ఎస్‌కే నిధులు రూ. 6,12,78,100, జేఎస్‌వై నిధులు రూ. 1,62,48,900 విడుదలైనట్లు తెలిపారు. మూడేళ్లుగా ప్రసూతి బాలింతలకు ఇవ్వాల్సిన రూ.13వేల నగదు పారితోషికం ఇవ్వడం లేదన్నారు. నిధులు విడుదలవుతున్నా ఇవ్వకపోవడం దారుణమన్నారు. నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు అందజేసినవారిలో వినియోగదారుల మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు వీఎస్ వర్మ, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్, కొనకల సాయిరెడ్డి ఉన్నారు.

రుణాలు రికవరీ చేయాలి



డిచ్‌పల్లి: స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణాలను వంద శాతం రికవరీ చేయాలని డీఆర్డీవో సాయాగౌడ్ సూచించారు. డిచ్‌పల్లిలోని టీటీడీసీలో గురువారం నిర్వహించిన స్త్రీనిధి జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్ణయించిన లక్ష్యం మేరకు స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలని సూచించారు. సమావేశంలో స్త్రీనిధి జోనల్ మేనేజర్ కిశోర్, స్త్రీనిధి ఆర్ఎం రాందాస్, డీపీఎం శ్రీనివాస్, జిల్లా అకౌంటెంట్ నాగమణి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ, కార్యదర్శి వనిత, కోశాధికారి లక్ష్మి, డైరెక్టర్ ఉషారాణి, సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షాకేంద్రాల తనిఖీ




నిజామాబాద్‌అర్బన్: ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ నగరంలోని నిర్మలహృదయ, సీఎస్‌ఐ జూనియర్ కళాశాల సెంటర్లను సందర్శించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, దాస్ నగర్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే బీసీ జూనియర్ కళాశాల, ఉమెన్స్ జూనియర్ కళాశాల సెంటర్లను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యుడు రవికుమార్ బోధన్‌లోని మధు మలాంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌తో పాటు మరో 4 ప్రైవేట్ కళాశాలలను తనిఖీ చేశారు. హై పవర్ కమిటీ ఐదు సెంటర్లను, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 28 సెంటర్లను తనిఖీ చేశాయి. మొత్తం 16,961 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గాను 723 మంది గైర్హాజరు కాగా 16,238 మంది హాజరయ్యారు.

పన్ను బకాయిపై 90 శాతం వడ్డీమాఫీ

నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ అవకాశం కల్పించినట్లు కమిషనర్ మంద మకరందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బకాయిలపై ఉన్న కేవలం 10శాతం వడ్డీతో పన్ను చెల్లించాలని సూచించారు. ఈనెల 31తేదీలోగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంతకు ముందే చెల్లించిన వారికి అడ్వాన్స్ రూపంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి అడ్జెస్ట్ చేయనున్నట్లు తెలిపారు.

మరో రైల్వే లైన్‌కు గ్రీన్ సిగ్నల్!

- మార్చి 4న శంకుస్థాపన చేయనున్న మోదీ?
- ఆదిలాబాద్-ఆర్మూర్ మధ్య 136 కిలోమీటర్ల మేర నిర్మాణం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ప్రజల చిరకాల కోరిక అయిన ఆదిలాబాద్-నిర్మల్-ఆర్మూర్ మధ్య 136 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 4న ప్రధాని ఆదిలాబాద్ పర్యటనకు రానున్నారు. అధికారిక కార్యక్రమాలతో పాటు ఎన్నికల శంఖారావం పూరించే రాజకీయ సభలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలకు మేలు చేసే రైల్వేలైన్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో బీజేపీ శ్రేణుల్లో మరింత జోష్ వస్తుందనడంలో సందేహం లేదు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ సీట్లలో ప్రజలు బీజేపీని గెలిపించారు. మళ్లీ ఈ స్థానాలు నిలబెట్టుకునేందుకు గాను ఈ కొత్త రైల్వేలైన్ మరింత ఊతమిస్తుందని ఆ పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఇప్పటికే గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రధాని పసుపు బోర్డు మంజూరు ప్రకటన చేశారు. దీంతో ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో ఏకంగా ఏడు అసెంబ్లీ సీట్లను ఆ పార్టీ గెలుచుకుంది. దీంతో కమలనాథుల్లో మరింత జోష్ వచ్చింది. ఈసారి కేంద్రంలో 370 సీట్లు గెలుచుకునే లక్ష్యంతో ముందుకెళ్తున్న బీజేపీ చిన్న అవకాశాన్ని సైతం జారవిడుచుకోవడంలేదు. గెలిచే అవకాశం ఉన్న ప్రతి సీటుపై వ్యూహాలు రచిస్తోంది.

నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు నిర్మల్, బోథ్ నియోజకవర్గాల మీదుగా నేరుగా ఆదిలాబాద్‌కు రైల్వేలైన్ కనెక్టివిటీ కోసం నిధుల మంజూరు విషయమై అన్నివర్గాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. 2016-17 కేంద్ర బడ్జెట్లో ఆర్మూర్-నిర్మల్-ఆదిలాబాద్ రైల్వేలైన్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఇందుకు సంబంధించి 136 కిలోమీటర్ల లైన్‌కు రూ. 2,720 కోట్ల అంచనాతో ప్రతిపాదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50శాతం చొప్పున నిధులను భరించేలా నిర్ణయించారు. ఈ క్రమంలో కేంద్రం క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ కింద మంజూరు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 50శాతం వాటా రూ. 1,360 కోట్లు ఇచ్చే విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదరకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది. అయితే త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో.. ఆదిలాబాద్, నిజామాబాద్ లోక్‌సభ స్థానాలకు బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నందున కేంద్రమే వందశాతం నిధులు భరించేలా మంజూరు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

మెగా డీఎస్సీపై హర్షం

- నోటిఫికేషన్ విడుదలతో నిరుద్యోగుల్లో సంతోషం
- జిల్లాలో భర్తీకానున్న 601 పోస్టులు
- గతంతో పోలిస్తే రెట్టింపైన ఉద్యోగాల సంఖ్య
- ఈనెల 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ



నిజామాబాద్‌అర్బన్: మెగా డీఎస్సీ నోటిఫికేషన్ నిరుద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. గతంతో పోలిస్తే జిల్లాలో రెట్టింపు సంఖ్యలో పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌లో 309 పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించగా, ప్రస్తుత ప్రభుత్వం ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. మెగా డీఎస్సీలో భాగంగా జిల్లాలో 601 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తాజా నోటిఫికేషన్‌లో పేర్కొంది. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 135, ఎస్జీటీ విభాగంలో 434, లాంగ్వేజ్ పండిత్ విభాగంలో 23, పీఈటీలు 9 పోస్టులు ఉన్నాయి. ఈ నెల 4 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహించనున్నారు. గతేడాది డీఎస్సీ దరఖాస్తు చేసుకున్న వారు ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసిన అధికారులు, కొత్తవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో అత్యధికంగా ఎస్జీటీ (తె.మీ)లో 285 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ (తె.మీ) సాంఘిక శాస్త్రం 37 పోస్టులు, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో 28 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ గణితం (తె.మీ)లో 16 పోస్టులు భర్తీ చేయనున్నారు.

సబెక్టుల వారీగా భర్తీ పోస్టులు..

హిందీ ఎల్‌పీ	07	ఎస్‌ఏ ఫిజికల్‌సైన్స్ (తె.మీ)	05
తెలుగు ఎల్‌పీ	10	ఎస్‌ఏ సోషల్ (తె.మీ)	37
ఉర్దూ ఎల్‌పీ	06	ఎస్‌ఏ సోషల్ (ఉ.మీ)	08
పీఈటీ	09	ఎస్‌ఏ తెలుగు	11
ఎస్‌ఏ బయోసైన్స్ (తె.మీ)	20	ఎస్‌ఏ ఉర్దూ	03
ఎస్‌ఏ బయోసైన్స్ (ఉ.మీ)	03	ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ (తె.మీ)	10
ఎస్‌ఏ ఇంగ్లిష్	07	ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఉ.మీ)	01
ఎస్‌ఏ హిందీ	09	ఎస్జీటీ (ఇ.మీ)	05
ఎస్‌ఏ మ్యాథ్స్ (తె.మీ)	16	ఎస్జీటీ (హి.మీ)	02
ఎస్‌ఏ మ్యాథ్స్ (ఉ.మీ)	02	ఎస్జీటీ (తె.మీ)	285
ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ (తె.మీ)	03	ఎస్జీటీ (ఉ.మీ)	111
		ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ (తె.మీ)	28
		ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఉ.మీ)	03

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు నిర్వహిస్తున్న విద్యారణ్య భారతీస్వామి


పాల్గొన్న భక్తులు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని మార్కండేయ మందిరం(కోటగల్లి)లో ఐదురోజులపాటు కొనసాగిన మార్కండేయ ప్రాణప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజైన గురువారం హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి చేతుల మీదుగా భక్త మార్కండేయ విగ్రహం, రాజగోపుర ప్రాణప్రతిష్ఠాపణ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. శతాధి ప్రతిష్ఠాపనాచార్యులు చౌట్‌పల్లి గంగాప్రసాద్ దీక్షితులు పౌరోహిత్యంలో నిర్వహించిన పార్వతీరాజరాజేశ్వర స్వామి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. మంగిరాములు మహరాజ్, ఇప్పకాయల హరిదాస్ స్వామి, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డితోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, మేయర్ నీతూకిరణ్ మార్కండేయ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. నగర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వేలమంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నగర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గుజ్జేటి వెంకటనర్సయ్య, జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బిజ్జు దత్తాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఏడో ర్యాంకు


అరవింద్

వర్ని(మోస్రా): తెలంగాణ గురుకులం జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో మండలంలోని గోవూర్ గ్రామానికి చెందిన సుంకే అరవింద్‌కుమార్ రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు సాధించాడు. పీజీటీ, టీజీటీ ఉద్యోగాలను సైతం అరవింద్ సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఉస్మానియాలో అరవింద్ పీజీ పూర్తి చేశాడు.

లీప్ ఇయర్ రోజు జీజీహెచ్‌లో 14 మంది జననం

నిజామాబాద్ నాగారం: నగరంలోని జీజీహెచ్‌లో గురువారం లీప్ సంవత్సరం రోజున 14 మంది జన్మించారు. నాలుగు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఫిబ్రవరి 29న వారు జన్మించడంతో పుట్టినరోజు కార్యక్రమాలు నాలుగేళ్లకోసారి జరుపుకోనున్నారు. అలాగే వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో సుమారు 30 మంది శిశువులు జన్మించినట్లు తెలిసింది.

బీజేపీతోనే రైతులకు భవిష్యత్

- షుగర్ ఫ్యాక్టరీ కోసం కాంగ్రెస్ చేసిందేమీ లేదు
- ఆ పార్టీ మాటలు నమ్మొద్దు
- ఎంపీ అర్వింద్


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

బోధన్: బీజేపీతోనే రైతులకు భవిష్యత్ ఉంటుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా బోధన్‌లోని ఎన్డీఎస్ఎల్ వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూతపడిన నిజాంషుగర్స్‌ను పునరుద్ధరించడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్రం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోలేకపోయాయన్నారు. ప్రధాని మోదీతోనే షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. సమస్యలను పరిష్కరించి ఫ్యాక్టరీని అమ్మేందుకు సిద్ధంగా ఉంటే కొనుగోలు చేసి నడిపేందుకు చాలా మంది ఉన్నారని తాను నాలుగేళ్ల క్రితమే అప్పటి సీఎం కేసీఆర్‌కు లేఖరాసినట్లు తెలిపారు.

నామినేషన్లు వేయండి

చెరుకు ఫ్యాక్టరీ కోసం రైతులు ఉద్యమించాలని, ఎంపీ ఎన్నికల్లో నామినేషన్లు వేయాలని పిలుపునిచ్చారు. ఇంకెన్నాళ్లు చూస్తూ కూర్చుంటారని, ఎందుకు ఉద్యమించరని రైతులను ప్రశ్నించారు.

రేవంత్, కవిత మంచి మిత్రులు

సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత ఇద్దరు మంచి మిత్రులని, ఎంపీ అభ్యర్థులను వారిద్దరు మాట్లాడుకునే డిసైడ్ చేస్తారని అర్వింద్ అన్నారు. పెద్దమనిషి జీవన్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అంతకుము 'బీజేపీతోనే చెరుకు రైతుల భవిష్యత్, మోదీ పాలనలోనే చెరుకు ఫ్యాక్టరీలకు మద్దతు' పేరుతో ముద్రించిన కరపత్రాలను ఎంపీ ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నేతలు రావుల రాంనాథ్, శ్రీధర్, సుధాకర్‌చారి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లాలో 30, 30ఏ పోలీస్ యాక్టు అమలు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లాలో ఈ నెల 1 నుంచి 7 వరకు 30, 30ఏ పోలీస్ యాక్టు అమల్లో ఉంటుందని ఎస్పీ సింధు శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టకూడదన్నారు. ఏవైనా కార్యక్రమాలు చేయాలనుకునే వారు సంబంధిత సబ్ డివిజన్ పోలీసులను సంప్రదించి అనుమతి పొందాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

నిర్మాణంలో ఉన్న భవనం కూల్చివేత



మాక్లూర్: మండలంలోని మాణిక్‌బండార్ శివారులో అక్రమంగా నిర్మిస్తున్న మున్నూరుకాపు కల్యాణ మండప నిర్మాణ పనులను నిజామాబాద్ మున్సిపల్ అధికారులు గురువారం అడ్డుకుని బేస్మెట్ వరకు పూర్తయిన గోడలను జేసీబీతో కూల్చివేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి గత ఎన్నికల లబ్ది కోసం ఆగమేఘాల మీద ఎలాంటి అనుమతులు లేకుండా మున్నూరు కాపు కల్యాణ మండప నిర్మాణానికి మాణిక్‌బండార్ శివారులో ఉన్న భూమిని చూయించి భూమి పూజ చేసినట్లు తెలిపారు. ఈ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేసినట్లు పేర్కొన్నారు.

హోరాహోరీగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ క్రికెట్ మెన్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. నాలుగవ రోజైన గురువారం నిర్వహించిన మొదటి మ్యాచ్‌లో తెయూ మెయిన్ క్యాంపస్ పీజీ టీమ్‌తో తెయూ సౌత్ క్యాంపస్ టీం తలపడగా 12 ఓవర్లలో 104 పరుగులు సాధించి వర్సిటీ పీజీ టీం విజయం సాధించింది. సెమీఫైనల్‌లో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేర్ డిగ్రీ కళాశాల జట్లు తలపడగా 15 ఓవర్లలో 145 పరుగులు సాధించి గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుందని వర్సిటీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ జి.బాలకిషన్ తెలిపారు.

డ్వాక్రా రుణం చెల్లించలేక వివాహిత ఆత్మహత్య


చింతకుంట కవిత(ఫైల్)

రామారెడ్డి: డ్వాక్రా గ్రూప్‌లో రూ. 2.5 లక్షల రుణం పొంది వాయిదాలను చెల్లించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో గురువారం చోటుచేసుకుంది. రామారెడ్డి ఎస్సై విజయ్ కొండ తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డికి చెందిన కవిత(36)కు 20 ఏళ్ల క్రితం చింతకుంట కిషన్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కవిత కొన్ని రోజుల క్రితం డాక్రా గ్రూప్ ద్వారా తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి రూ. 2.50 లక్షల లోన్ తీసుకుంది. లోన్ తాలుకా వాయిదాలను చెల్లించలేకపోవడంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరీక్షల్లో వసూళ్లు!

- టీసీసీ పరీక్ష నిర్వహణలో ఒక్కో అభ్యర్థి నుంచి రోజుకు రూ. 500
- వంపకాల్లో తేడా రావడంతో బట్టబయలు



నిజామాబాద్‌అర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టీసీసీ) పరీక్షల నిర్వహణలో భారీగా వసూళ్లు జరిగాయి. పరీక్ష నిర్వాహకులు అభ్యర్థుల నుంచి డబ్బు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టైలరింగ్, డ్రాయింగ్ పరీక్షలు ఈనెల 23 నుంచి 26 వరకు జరిగాయి. అభ్యర్థులతో కలిసి నిర్వాహకులు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. పరీక్షల్లో జిల్లా విద్యాశాఖ అధికారుల పేర్లు చెప్పి వసూలు చేపట్టడం గమనార్హం.

పాస్ కావాలంటే పైసలు ఇవ్వాల్సిందే..

ఇటీవల నిర్వహించిన టైలరింగ్, లోయర్, హయ్యర్ డ్రాయింగ్ పరీక్షలకు 420 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. వీరికి నగరంలోని కోటగల్లీలో ఉన్న పాఠశాల, ఆదర్శ హిందీ విద్యాలయం, ఖిల్లా ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. ఒక్కోసెంటర్‌కు ఐదు నుంచి పది చొప్పున ఇన్విజిలేటర్ల కూడా కేటాయించారు. కానీ ఇక్కడే మతలబు ఏర్పడింది. కోటగల్లిలోని పాఠశాల నిర్వాహకులే అభ్యర్థులతో కుమ్మక్కై, కొందరు అభ్యర్థుల నుంచి రోజుకు రూ. 500 చొప్పున తీసుకొని ఒకరికి బదులు మరొకరి పరీక్షలు రాయించినట్లు తెలిసింది. ఈ పరీక్ష కేంద్రంలో 64 మంది వివిధ విభాగాల్లో పరీక్షలు రాశారు. ఓ మహిళను అడ్డుపెట్టుకొని అభ్యర్థులను ప్రత్యేకంగా సంప్రదించి ఈ వసూళ్లు చేపట్టారు. ఈ పరీక్షలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, అధికారులు దృష్టి పెట్టకపోవడంతో నిర్వహణలో బాధ్యతలు తీసుకున్న వారు అక్రమాలకు పాల్పడ్డారు. మరో పరీక్ష సెంటర్‌లో ప్రతిరోజు డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ అభ్యర్థులతో కలిసి అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. టైలరింగ్‌లో అభ్యర్థిగా వేరేవారు పాల్గొని థియరీ పరీక్షలు రాసినట్లు తెలిసింది. పరీక్ష జరిగిన మొదటి రోజు నుంచే అభ్యర్థులతో నేరుగా గదిలోకి వెళ్లి అధికారులు రోజుకు ప్రతిఒక్కరూ డబ్బులు ఇస్తే కచ్చితంగా పాసు చేస్తామని ఒకరికి బదులు మరొకరు కూడా రాసుకునే వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు. రూ. 500 ఇచ్చిన వారికి రాసుకునే వెసులుబాటు, రూ. 1000 ఇచ్చిన వారికి ఒకరికి బదులు ఒకరు రాసుకునే వెసులుబాటు కల్పించినట్లు వారి వసూలు బట్టి తెలుస్తోంది. ఇలా వసూలు చేసిన డబ్బులను పరీక్ష నిర్వహణలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి డబ్బులు ఇవ్వాలని ముందుగా నిర్ణయించుకున్నారు. కానీ ఇందులో కొందరు ఇన్విజిలేటర్లకు డబ్బులు అందకపోవడంతో రెండు రోజుల క్రితం సదరు అధికారిపై డబ్బులు ఇస్తారా లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానంటూ వాగ్వాదం జరిగింది. ఇదే తరుణంలో వీరి అక్రమాలు బయటకు వచ్చాయి.

అక్రమార్కులకే అదనపు బాధ్యతలు

అక్రమాలకు పాల్పడే వారికి అదనపు బాధ్యతలు కూడా కేటాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పరీక్ష నిర్వహణ బాధ్యతతో పాటు పాఠశాల బాధ్యతలు కూడా అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరు తమకు అనుకూలమైన సిబ్బందిని నియమించుకొని పరీక్షల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మూడు పరీక్ష కేంద్రాల్లోనూ సుమారు 60 శాతం మంది అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఉన్నత అధికారుల పర్యవేక్షణ, మండల స్థాయి అధికారులు పదో తరగతి పరీక్షల్లో బిజీగా ఉండడంతో ఇటు వైపు కన్నెత్తి చూడలేదు. దీనినే ఆసరాగా మార్చుకొని సాధారణ నిర్వాహకులు ఇష్టానుసారంగా పరీక్షలు నిర్వహించినట్లు ఆరోపణలున్నాయి.

ముగిసిన విజయ సంకల్ప యాత్ర


కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేశ్‌రెడ్డి

జిల్లాలో నిర్వహించిన విజయ సంకల్ప యాత్ర గురువారం ముగిసింది. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన ముగింపు సభకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడిరాకేశ్‌రెడ్డి స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. సభలో కేంద్ర మంత్రితో ఎంపీ అర్వింద్ కొద్దిసేపు ముచ్చటించారు. సభలో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

–సాక్షి, నెట్‌వర్క్




సభలో పాల్గొన్న కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు

నాటి పేపర్ బాయే.. నేటి లెక్చరర్

- నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గోవింద్‌పేట్ యువకుడు


సురేందర్

పెర్కిట్(ఆర్మూర్): ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనమైన ఈ రోజుల్లో ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించాడు ఆర్మూర్ మండలంలోని గోవింద్‌పేట్‌కు చెందిన సిరిపురం సురేందర్. కష్ట పడి చదివితే సాధించలేనిది ఏది లేదని నిరూపించి తల్లితండ్రుల ఆశలను నెరవేర్చాడు. గోవింద్‌పేట్‌లో వ్యవసాయ కూలీగా పని చేసే సిరిపురం సాయన్న, లక్ష్మి దంపతుల చిన్న కుమారుడు సురేందర్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 2009 సంవత్సరంలో పదో తరగతి, ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, నిజామాబాద్‌లోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. నిరుపేద కుటుంబంలో జన్మించిన సురేందర్ ఇళ్లు గడవడానికి పదో తరగతి నుంచి డిగ్రీవరకు సాక్షి దిన పత్రిక పేపర్ బాయ్‌గా పని చేసి విద్యను అభ్యసించాడు. డిగ్రీ అనంతరం హైదరాబాద్ వెళ్లి ఉస్మానియ యూనివర్సిటీలో 2016 సంవత్సరంలో ఎంఏ తెలుగు పూర్తి చేశాడు. అలాగే 2017–18 లో గ్రేటర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, షామీర్‌పేట్‌లో బీఎడ్ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఓయూ ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ పర్యవేక్షణలో 'ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాల సాహిత్యం' అనే అంశంపై పీహెచ్‌డీ చేస్తున్నాడు. గతేడాది ఆగస్టులో నిర్వహించిన గురుకుల టీజీటీ, పీజీటీ, డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పోటీ పరీక్షలు రాశాడు. పది రోజుల క్రితం విడుదలైన ఫలితాల్లో పీజీటీకి ఎంపిక కాగా బుధవారం విడుదలైన డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లోనూ డిగ్రీ లెక్చరర్‌గా, గురువారం విడుదలైన ఫలితాల్లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. అలాగే టీజీటీలో అత్యధిక మార్కులు ఉండడంతో టీజీటీకి కూడా ఎంపికవుతానని ధీమా వ్యక్తం చేస్తున్నాడు. కాగా డిగ్రీ లెక్చరర్‌గా స్థిరపడుతానంటున్నాడు. ప్రభుత్వం ప్రొఫెసర్ పరీక్షలు నిర్వహిస్తే దాంట్లోనూ విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నాడు. అలాగే సురేందర్ అన్నయ్య నరేందర్ సైతం చదువునే నమ్ముకుని ప్రస్తుతం డిచ్‌పల్లి బెటాలియన్‌లో ఆర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు.

ఆర్మూర్‌లో ఆపరేషన్ ఆకర్ష్..

- అధికారం కోసం కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- మరింత బలం పెంచుకోవడానికి కౌన్సిలర్లతో మంతనాలు



ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌ను చేపట్టింది. మున్సిపల్‌లో తమ పార్టీకి చెందిన ఒక్క కౌన్సిలర్ లేకున్నా రాష్ట్రంలో అధికారంలో ఉన్న తమ బలాన్ని ఎరగా వేస్తూ అధికారాన్ని కైవసం చేసుకోవడానికి మంతనాలు సాగిస్తున్నారు. మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరవేసి మాజీ జీవన్‌రెడ్డికి మరో ఓ టమిని చవి చూపించడమే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్ కొనసాగుతోంది. అందుకు మాజీ చైర్‌పర్సన్ పండిత్ వినీతకు వ్యతిరేకంగా బీఆర్ఎస్‌లో అంతర్గతంగా పుట్టిన ముసలాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్ రెడ్డి తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. వినీతపై సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి సిద్ధం కా గానే కాంగ్రెస్ నాయకులు చక్రం తిప్పడం ప్రారంభించారు. సంఖ్యా బలం లేకున్నా 12 మంది కౌన్సిలర్లతో ఉన్న వినీత వర్గీయులను తమ పార్టీలో చేర్చుకొని చైర్ పర్సన్ పదవిని కాపాడటానికి ఎత్తులు వేసి ఆ వర్గాన్ని బీఆర్ఎస్ పార్టీకి పూర్తిగా దూరం చేశారు. మరో వైపు వినీతకు అనుకూలంగా అవిశ్వాస తీర్మానం వీగిపోయిందంటూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుకూలంగా ఉత్తర్వులు సైతం తీసుకొచ్చారు. కానీ వీరు కాంగ్రెస్ పార్టీలో చేరేలోపే బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు పలుమార్లు హైకోర్టును ఆశ్రయించి అవిశ్వాస తీర్మానం నెగ్గిందంటూ తమకు అనుకూలంగా ఉత్తర్వులు సాధించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు వినీత వర్గీయులను పక్కన పెట్టి మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చెప్పు చేతల్లో ఉన్న 20 మంది కౌన్సిలర్లపై ఆపరేషన్ ఆకర్ష్‌ను ప్రయోగించారు. అధికార పార్టీ అండ ఉంటే గానీ తాము చైర్‌పర్సన్ పీఠాన్ని అధిరోహించలేమ ని భావించిన ఆశావహులు తమతో ఉన్న కౌన్సిలర్లను ప్రోత్సహించడంతో వైస్ చైర్మన్‌తో పాటు 14 మంది కౌన్సిలర్లు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియలో తనకు కొన్ని రోజులైనా ఇన్‌చార్జి చైర్‌పర్సన్ బాధ్యతలు దక్కితే చాలు చరిత్రలో నిలిచిపోతాననుకుంటూ వైస్ చైర్మన్ షేక్ మున్ను పార్టీ మారడానికి ఆసక్తి చూపించారు. వీరి చేరికలతో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీపై తమ జెండా ఎగరవేసే పరిస్థితులకు చేరువయ్యింది. బీఆర్ఎస్ వర్గంలో కొనసాగిన నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గంగా మోహన్ చక్రు, ఎనుగంటి వర లక్ష్మి లింబాద్రి గౌడ్, బారడి రమేశ్, అల్జాపూర్ రేవతి మాత్రం పార్టీ ఫిరాయింపునకు ఆసక్తి చూపలేదు. దీంతో వీరిని సైతం కాంగ్రెస్‌లో చేర్చుకొని బలం పెంచుకోవడానికి ఆ పార్టీ నాయకులు మంతనాలు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఆపరేషన్ ఆకర్ష్ విజయవంతంగా కొనసాగుతుండటంతో ఇక చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడటమే తరువాయిగా ఉంది.

ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు..


కేతావత్ సంగీత

వర్ని: ఆడవారు వంటింటికే కాదు.. ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడంలోనూ ముందుంటారని నిరూపించింది మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన కేతావత్ సంగీత. గతేడాది ఆగస్టులో నిర్వహించిన టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ పోటీ పరీక్షలు రాశారు. నెల రోజుల వ్యవధిలోనే రాసిన మూడు పరీక్షల్లో ఉద్యోగాలు సాధించి అందరినీ ఔరా అనిపించింది. గత నెలలో ట్రైనీ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) ఉద్యోగం రాగా, 15 రోజుల క్రితం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ)గా ఉద్యోగం వచ్చింది. బుధవారం విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లోనూ ప్రతిభ కనబర్చడంతో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై ంది. దీంతో కుటుంబీకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీవో 317 సమస్యను పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల జీవో.317 సమస్యను ప్రభుత్వ మంత్రివర్గ ఉప సంఘం పరిష్కారం చూపాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, తెలంగాణ అవినీతి వ్యతిరేక వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ విజయరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఈ సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

కట్టుకున్నవాడే కడ తేర్చాడు..

- ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం
- కేసును ఛేదించిన పోలీసులు


మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

బాల్కొండ: మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వివాహిత కేసును పోలీసులు ఛేదించారు. కట్టుకున్న వాడే తనపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలంటూ భార్యను చిత్రహింసలకు గురిచేసి చివరికి టవల్‌తో మెడను గట్టిగా నొక్కి హత్య చేసినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బాల్కొండ పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై గోపి కేసు వివరాలు వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన ధర్మాయి లావణ్య(32), ధర్మాయి రాజేందర్ భార్యాభర్తలు. కొంత కాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కోర్టులో పలు కేసులు కూడా నమోదయ్యాయి. కేసుల విషయమై విత్‌డ్రా చేసుకోవాలని లేదంటే చంపేస్తానంటూ మానసికంగా, శారీరకంగా లావణ్యతో పాటు ఆమె తల్లితండ్రులను రాజేందర్ భయభ్రాంతులకు గురిచేసేవాడు. దీంతో ఆమె గతంలోనే చనిపోవాలని సూసైడ్ నోట్ కూడా రాసి పెట్టుకుంది. కానీ ప్రయత్నాన్ని విరమించుకుంది. కోర్టులో గురువారం కేసు విచారణకు ఉండటంతో మంగళవారం రాత్రి కేసుల విషయమై వీరి మధ్య గొడవ జరిగింది. దీంతో లావణ్యను రాజేందర్ కొట్టి, టవల్‌తో గొంతును గట్టిగా నొక్కి హత్య చేశాడు. చివరకు హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించాడు. మృతిపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టడంతో రాజేందర్ తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో భర్త రాజేందర్, ఆమెను హింసించిన అత్త ధర్మాయి గంగు, మామ పెద్దన్న, ఆడపడుచు మంగ గంగామణిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వాగులో పడి ఒకరి మృతి

మాక్లూర్: ప్రమాదవశాత్తు వాగులో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని జన్నేపల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్లభాపూర్‌కు చెందిన గొల్ల గంగాధర్ (55) బుధవారం జన్నేపల్లి సంతకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సంత సమీపంలో ఉన్న వాగులో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వాగులోకి దిగడంతో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. వాగులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణలో గంగాధర్ మృతదేహంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. కాగా గంగాధర్ భార్య ఇందిర అనారోగ్యంతో 15 ఏళ్ల క్రితం మృతి చెందింది. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తె, కుమారుడి వివాహాలు జరిపించగా మరో కుమార్తె అయిన మానసిక వికలాంగురాలు ప్రియాంక తండ్రితో ఉంటోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అడ్లూర్‌ఎల్లారెడ్డిలో..


స్వామి(ఫైల్)

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి శివారులో ఒకరు చెట్టును ఢీకొని కాలువలో పడి మృతిచెందినట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇందల్‌వాయి మండలం నల్లవెల్లికి చెందిన తిరుడు స్వామి(52) ఈ నెల 26న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కాలువలో మృతదేహం ఉందన్న ఇరిగేషన్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టగా నల్లవెల్లికి చెందిన స్వామిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. కాగా కుటుంబీకులు మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య కళావతి, నలుగురు కుమారులు ఉన్నారు.

బస్సు డ్రైవర్‌కు జైలు శిక్ష

ఆర్మూర్‌టౌన్: బస్సును అతివేగంగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన బస్సు డ్రైవర్ మొహినొద్దీన్‌కు ఆర్మూర్ ప్రథమశేణి న్యాయమూర్తి వేముల దీప్తి గురువారం రెండు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, రూ. 1000 జరిమాన విధించినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మెండోరా మండలం దూదిగాం జాతీయ రహదారిపై 2017 ఫిబ్రవరి 26న బైక్‌పై వెళ్తున్న కొడిచెర్ల గ్రామానికి చెందిన సామగంగారెడ్డి అతని కుమార్తె సృజన, మనమడు సమీత్‌రెడ్డిలను బస్సు డ్రైవర్ అతివేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో సమీత్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా సృజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. విచారణలో నేరం రుజువు కావడంతో డ్రైవర్‌పై రెండేళ్ల జైలు శిక్షను జడ్జి విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇద్దరి బైండోవర్

కామారెడ్డి క్రైం: రాత్రిపూట అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కాలనీల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న పట్టణానికి చెందిన తెడ్ల నగేశ్, మిట్టపల్లి బాబులను పట్టుకొన్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలని అన్నారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- డ్రైవర్‌కు తీవ్రగాయాలు, స్వల్పగాయాలపాలైన ప్రయాణికులు


ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

భిక్కనూరు: వాటర్ ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా, పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు సీఐ సంపత్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జంగంపల్లి శివారులోని జాతీయ రహదారిపై చెట్లకు నీరు పడుతున్న వాటర్ ట్యాంకర్‌ను హైదరాబాద్ నుంచి నిర్మల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుకాల నుంచి వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ గోపాల్‌కు తీవ్రగాయాలు కాగా పది మంది ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. ఘటన స్థలానికి క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించినట్లు సీఐ సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్ తెలిపారు.


గాయపడ్డ డ్రైవర్

వైన్‌షాప్ ఎదుట ఒకరి మృతి

భీమ్‌గల్: మండలంలోని వైన్‌షాప్ ఎదుట ఒకరు అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు ఎస్సై హరిబాబు గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం వైన్‌షాప్ ఎదుట మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా కొండాపురం మండలానికి చెందిన మాల కొండయ్యగా గుర్తించినట్లు పేర్కొన్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాలువలో మృతదేహం లభ్యం

రుద్రూర్: కోటగిరి శివారులోని నిజాంసాగర్ కాలువలో మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మృతుడిని రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామానికి చెందిన హంగర్గా వీరన్న(65)గా గుర్తించినట్లు పేర్కొన్నారు. కాలువలో దిగినపుడు నీటి ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

కామారెడ్డి క్రైం: అదుపుతప్పిన ఓ బియ్యం లారీ డివైడర్‌ను ఢీకొన్న ఘటన గురువారం ఉదయం కామారెడ్డి బస్టాండ్ ఎదుట చోటు చేసుకుంది. డివైడర్‌ను ఢీకొన్న వెంటనే డ్రైవర్ బయటకు దూకేశాడు. దీంతో అతనికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఆ సమయంలో రద్దీ తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.

జొన్న కుప్ప దగ్ధం

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన శివాయి చిన్న నర్సయ్యకు చెందిన తెల్ల జొన్న కుప్ప దగ్ధమైంది. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో కుప్ప అగ్గిపాలైందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారుగా రూ. 30 వేలు విలువ చేసే జొన్నలు,రెండు తాటిపత్రులు కాలి బూడిదయ్యాయన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

కరెంట్ తీగలు తగిలి..

తాడ్వాయి: మండల శివారులో కరెంట్ తీగలు తగిలి మొక్కజొన్న పంట దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. మండల కేంద్రానికి బండారి రాములుకు చెందిన మొక్కజొన్న పంటపై బుధవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు కరెంట్ తీగలు ఒకదానికొకటి తగలడంతో నిప్పుకణికలు పంటపై పడి అగ్నికి ఆహుతైనట్లు తెలిపారు. చేతికొచ్చిన పంట నష్టపోయానని ట్రాన్స్‌కో అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.

భర్త వేధింపులతోనే భార్య ఆత్మహత్య


శిరీష (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): భర్త వేధింపులతోనే వివాహిత నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం గండిమాసానిపేటకు చెందిన శిరీష(25), సతీశ్ దంపతులు. వీరికి ఏడాది బాబు యోగేశ్ ఉన్నాడు. తరచూ భర్త వేధింపులతో పాటు ఆధార్‌కార్డులో అడ్రస్ మార్పు విషయమై వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మానసిక వేదనకు గురైన శిరీష బుధవారం తల్లిగారింటికి వెళ్తున్నాని చెప్పి కుమారుడు యోగేశ్‌తో కలిసి బస్సులో వెళ్లింది. మార్గమధ్యలో బస్సు దిగిన శిరీష నిజాంసాగర్ ప్రధాన కాలువ సమీపంలో ఉన్న చెట్టు కింద కుమారుడు యోగేశ్‌ను కూర్చోబెట్టి తాను కాలువలో పడి ఆత్మహత్య చేసుకుంది. నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో మృతదేహం ఆచూకీ లభించలేదు. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల నిలిపివేయడంతో గురువారం ఉదయం మృతదేహం లభ్యమైంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మొరం వ్యాపారులకు జరిమానా

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక జేసీబీని రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. గురువారం ఉదయం వాహన యజమానులను పిలిపించి జరిమానా విధించారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా మొరం తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.